స్ఫూర్తి ప్రదాతకు నివాళి



సదాశివపేటలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

రాజ్యాంగ నిర్మాత, బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నోకష్టాలను ఎదుర్కొని ఉన్నత శిఖరాలను అధిరోహించిన అంబేడ్కర్ ఆదర్శప్రాయుడన్నారు. భారత రాజ్యాంగ రూపకర్త అని కొనియాడారు. యువత జెండాలతో జైభీమ్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీలు తీశారు. అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



నారాయణఖేడ్: ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మొగుడంపల్లిలో..



హత్నూర మండలం దౌల్తాబాద్‌లో..



పటాన్‌చెరు టౌన్: నివాళులర్పిస్తున్న నీలం మధు ముదిరాజ్ తదితరులు



వట్‌పల్లి(అందోల్): నివాళులర్పిస్తున్న న్యాయవాది చంటి ప్రభు



రామచంద్రాపురం పట్టణంలో..



భారతినగర్ డివిజన్‌లో..

కొనుగోలు కేంద్రాలతో మేలు

నారాయణఖేడ్: రైతులు పండించిన ధాన్యం, జొన్నలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. నిజాంపేట్ మండల కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం, మునిగేపల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులు పండించిన పంటలను చివరి గింజవరకు కొనుగోలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ హయాంలో తరుగు పేరిట అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ రాధా కిషన్, నాయకులు పాల్గొన్నారు.





కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి, మహిపాల్ రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పటాన్‌చెరు: రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం ప్రాథమిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ధాన్యం విక్రయించే సమయంలో తేమశాతం లేకుండా చూసుకోవాలన్నారు.

కురుమలను గౌరవించింది కేసీఆరే

మాజీ మంత్రి హరీశ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో కురుమ జాతిని గౌరవించింది కేసీఆర్ ప్రభుత్వమేనని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సోమవారం తెల్లాపూర్‌లోని బీరప్పస్వామి ఆలయంలో కొనసాగుతున్న జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కురుమలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. వారికి ఎమ్మెల్సీ పదవితో పాటు మల్లన్న దేవుడిని కులదైవంగా భావించే కురుమలకే కొమురవెల్లి మలన్న దేవాలయ చైర్మన్‌గా చేశామన్నారు. మల్లన్న కృపతో మల్లన్న సాగర్, కాళేశ్వరం నుంచి ప్రజలకు తాగు నీరు, సాగునీరు అందించి కరువు లేకుండా రాష్ట్రాన్ని సుభిక్షంగా పాలించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. ఈ సందర్భంగా కురుమ సంఘం నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, నియోజకవర్గ బీఆర్ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీమంత్రి హరీశ్‌రావు

భూసమస్యల పరిష్కారానికే భూభారతి



వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఉజ్వల్‌రెడ్డి

జహీరాబాద్: రైతుల భూ సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి 'భూ భారతి'ని ప్రారంభించారని జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హుగ్గెల్లి గ్రామ రైతు వేదికలో సీఎం రేవంత్ రెడ్డి భూభారతి కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉజ్వల్‌రెడ్డి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసమే మొదటి ప్రాధాన్యతనిస్తోందన్నారు. భూ భారతి కార్యక్రమం ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం కానున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఓలు లావణ్య, వినోద్‌కుమార్, ఏఈఓ ప్రదీప్ కుమార్, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, అర్షద్, అక్బర్, భీమయ్య, కిరణ్‌గౌడ్, నరేష్, రాజశేఖర్, కిషన్‌రాథోడ్ పాల్గొన్నారు.

రైతులకు భరోసా

వట్‌పల్లి(అందోల్): ప్రజల భూములకు భద్రత, భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను తీసుకువచ్చిందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం వట్‌పల్లి రైతువేదిక భవనంలో భూ భారతి ప్రారంభోత్సవ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ భారతి పోర్టల్ ఉపయోగాలు, భూ సమస్యల పరిష్కారం వంటి విషయాలు వెల్లడించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు పి.వినయ్‌గౌడ్, మాజీ ఎంపీపీ పత్రి విఠల్, కచూర్‌రావు, ఏయంసీ డైరెక్టర్ దిగంబర్ రావు, తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన

సదాశివపేట(సంగారెడ్డి): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు అగ్నిమాపక అధికారి భిక్షపతి పేర్కొన్నారు. సోమవారం సదాశివపేట ఫైర్ స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్మారక ఊరేగింపు, అగ్నిమాపక శాఖ త్యాగాలు, సేవలు, ప్రజాభద్రతపై ప్రజలకు వివరించి అవగాహన కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణాగౌడ్, సీఎఫ్ మునాఫ్, నరేష్‌రెడ్డి, సాయి కుమార్, సురేష్‌రెడ్డి, రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం



పార్కింగ్ షెడ్‌లో వ్యాపిస్తున్న మంటలు



కాలిపోయిన రెస్టారెంట్

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని ప్రభుత్వ పరిశ్రమల కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ సంఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఫైర్‌శాఖ ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని ప్రభుత్వ పరిశ్రమల కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్‌తో పార్కింగ్ షెడ్యూల్‌లో భారీగా మంటలు చెలరేగాయి. ఈ మంటలు మిగతా పార్కింగ్ షెడ్‌లో కూడా వ్యాపించడంతో షెడ్‌లో ఉన్న పాత సామన్లు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖకు సమాచారం అందిండంతో.. ఘటన స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే పార్కింగ్ షెడ్ పాక్షికంగా కాలిపోయింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెస్టారెంట్‌లో ప్రమాదం

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని (సంగం)కె గ్రామశివారులో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నిరుపయోగంగా ఉన్న రెస్టారెంట్ వెనుక భాగంలోని గదులతో పాటు పంట పొలానికి నిప్పు అంటుకుంది. దట్టమైన పొగలు ఒక్కసారిగా రావడంతో గమనించిన పలువురు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఇంజన్ వచ్చేసరికి వెనకాల భాగంలో ఉన్న గదులు పూర్తిగా కాలి దగ్ధమయ్యాయి.

ఓవర్‌టేక్ విషయంలో ఘర్షణ

నారాయణఖేడ్: పట్టణంలో బైక్‌పై వెళ్తున్న ఇరువురు ఓవర్ టేక్ విషయంలో రోడ్డుపై ఘర్షణకు దిగారు. దీంతో ఇరువర్గాలకు చెందిన వారు పరస్పరం దాడులకు పాల్పడడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలో ప్రతీ రోజు సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు సైలెన్సర్లతో భారీ సౌండ్ చేస్తూ కొందరు ఆకతాయిలు హల్‌చల్ చేస్తున్నారు. పోలీసులు పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు.




ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

తెలంగాణ సంస్కృతికి ప్రతీక జాతరలు

రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి

వట్‌పల్లి(అందోల్): జాతరలు, ఉత్సవాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం భిక్షపతి అన్నారు. సోమవారం అందోల్ మండలంలోని మాసాన్‌పల్లిలో నిర్వహించిన బీరప్ప జాతర ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతరల నిర్వహణతో గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. ఒత్తిడి తగ్గించుకోవడానికి ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ బాలయ్య పాల్గొన్నారు.



జాతర ఉత్సవాల్లో పాల్గొన్న భిక్షపతి

సదాశివపేటలో ప్రొటోకాల్ రగడ



కమిషనర్ ఉమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నిర్మలారెడ్డి, నాయకులు

కమిషనర్‌పై నిర్మలారెడ్డి ఆగ్రహం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలో అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా విగ్రహానికి తన కంటే ముందే ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పూలమాల వేశారు. దీంతో ప్రొటోకాల్ పాటించడం లేదని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి మున్సిపల్ కమిషనర్ ఉమపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 9.15లకు జయంతి వేడుకలు జరుగుతాయని అధికారులు ఎమ్మెల్యే, టీజీఐఐసీ చైర్మన్‌కు సమాచారం ఇచ్చారు. నిర్మలారెడ్డి వచ్చేవరకు ఎమ్మెల్యే ప్రభాకర్ ఎందుకు ఆగలేదని తనకంటే ముందుగానే 9 గంటలకే అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తుంటే మీరేం చేశారని కమిషనర్ ఉమపై నిర్మలారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. ఎమ్మెల్యే ప్రభాకర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు 9 గంటలకు చేరుకున్నారు. కాసేపు వేచి చూసిన ఎమ్మెల్యే మిగతా కార్యక్రమాలు ఉన్నాయని ఆలస్యమవుతుందని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వెళ్లిపోయారు. తరువాత టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి కాంగ్రెస్ నాయకులు అక్కడి చేరుకున్నారు. దీంతో విగ్రహానికి పూలమాల ఎవరు వేశారని, ప్రొటోకాల్ పాటించారని కమిషనర్ ఉమపై మండిపడ్డారు. ప్రొటోకాల్ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ మోసాలను ఎండగట్టండి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్ రెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీ పేరుతో చేస్తున్న మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ బహిరంగ సభకు పెద్దసంఖ్యలో తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సోమవారం మండల బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ దిగ్విజయానికి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నగేష్, మల్గొండ, వెంకటేశం, సాలమన్, నవాబ్, సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

దత్తగిరిలో మృత్యుంజయ హోమం



మృత్యుంజయ హోమం చేస్తున్న పీఠాధిపతులు

ఝరాసంగం(జహీరాబాద్): విశ్వశాంతి కోసం జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రమైన బర్దీపూర్ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. సోమవారం ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహరాజ్, డా.సిద్ధేశ్వర స్వామి ఆధ్వర్యంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. మృత్యుంజయ లక్ష జపయజ్ఞం, శివపార్వతుల కల్యాణం, పూర్ణాహుతి, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం గోపూజ, గణపతి పూజ, రుద్రాభిషేకం, మహా మంగళహారతి పూజలు చేశారున. అనంతరం యజ్ఞాలలో మృత్యుంజయ ప్రారంభించారు. పూజా కార్యక్రమాల్లో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, నాయకులు హాజరయ్యారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతులకు పూలమాల, శాలువాతో సన్మానించారు.

మానవజన్మను సార్థకం చేసుకోవాలి

రాజయోగి వెంకటస్వామి



భక్తులకు ఉపదేశిస్తున్న వెంకటస్వామి

మునిపల్లి(అందోల్): మానవజన్మను సార్థకం చేసుకోవాలని ఆత్మానందాశ్రమ పీఠాధిపతి భగవద్భక్త పరాగ పూజ్యపాద గురు రాజయోగి వెంకటస్వామి భక్తులకు ఉపదేశించారు. సోమవారం మండలంలోని మక్తక్యాసారం ఆత్మానందాశ్రమ 25వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మాదనానంద సరస్వతీ స్వామి, రాజయోగి వెంకటస్వామి గురుమూర్తులకు అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు, వేద పండితులు హోమం నిర్వహించారు. అంతకు ముందు శివలింగం, నందివిగ్రహాలను రాజయోగి వెంకటస్వామి ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ.. అనునిత్యం భగవంతుడిని నిచ్చలమైన మనస్సుతో పూజించి నామస్మరణ చేయాలని భక్తులకు తెలిపారు. ఇతరులను కష్టపెట్టకుండా కష్టపడి సంపాందించిన డబ్బుతో తృప్తి చెందాలన్నారు. లేని దాని కోసం ఆశపడకుండా ఉన్నదాంట్లో సంతృప్తి పొందాలన్నారు. పరుల సొమ్ముకు ఆశపడి కష్టాలను కొని తెచ్చుకోవద్దని హితబోధ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

శుక్లవర్ధన్‌రెడ్డికి సన్మానం



శుక్లవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

జహీరాబాద్: ఎంపీ కార్యాలయం ఇన్‌చార్జిగా నియామకమైన శుక్లవర్ధన్‌రెడ్డిని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ నాయకులు సత్కరించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ పవార్, కార్యదర్శి రవి చవాన్, నాయకులు రామ్‌సింగ్ రాథోడ్, సంజుకుమార్, శ్రీను బానోతు, శీను రాథోడ్ పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని పోతురెడ్డిపల్లికి చెందిన నగేష్ ప్రమాదవశాత్తు గాయపడ్డారు. సోమవారం మండల బీజేపీ నాయకులు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ప్రమాద ఘటనను అడిగి తెలుసుకొని పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. మండల బిజేపీ అధ్యక్షుడు శివచందర్, నాయకులు భూమయ్య, ఖలీల్, మహేందర్, నాగభూషణం తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **చంద్రమౌళీశ్వరుడికి పుష్పాభిషేకం**

నారాయణఖేడ్: పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తా సమీపంలోని భక్త మార్కండేయ ఆలయంలో సోమవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అభిషేకం, మహాహారతి, మహిళలు తెల్లపూలతో పుష్పాభిషేకం, అర్చనలు చేపట్టారు పద్మశాలీ మహిళా విభాగం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల పద్మశాలి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

◆ **ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ**

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం చింతల్ చెరుగ్రామంలో భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారణలు అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక శివాలయంలో నరహరి గురుస్వామి ఆధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో అయ్యప్పస్వామికి అభిషేకం, పడిమెట్ల పూజను చేశారు. శ్రీరామ అయ్యప్ప భజన మండలి ఆలపించిన పాటలు భక్తులను అలరించాయి. అనంతరం అన్నదాన వితరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమం సోలక్‌పల్లి గురుస్వామి జంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గణేష్, అయ్యప్ప భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **ల్యాండ్ మార్క్‌గా బసవేశ్వర చౌక్**

నారాయణఖేడ్: పట్టణంలోని బసవేశ్వరచౌక్‌ను ల్యాండ్ మార్క్‌గా తీర్చిదిద్దాలని మున్సిపల్ మాజీ చైర్మన్, లింగాయత్ సమాజ తాలూకా అధ్యక్షుడు ఆనంద్ స్వరూప్ షెట్కార్ తెలిపారు. ఆదివారం లింగాయత్ సమాజ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బసవేశ్వర చౌక్‌లో భారీ నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని అన్నారు. తాలూకా పరిధిలోని లింగాయత్‌లు సహకరించాలని కోరారు. ఈనెల 30న బసవ జయంతి ఉన్నందున భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు శెట్టి శంకర్, నాగొశెట్టి, వీరన్న, శివకుమార్, జగదీష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బాధిత రైతులు అధైర్య పడొద్దు**

జహీరాబాద్: కోహీర్ మండలంలోని పిచరాగడి గ్రామంలో సోమవారం భూ బాధిత రైతులు సమావేశమయ్యారు. రైతు హక్కుల సాధన సమితి అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. న్యాయపోరాటంలో తమ విజయం ఖాయమన్నారు. పార్లమెంట్‌లో వక్ఫ్‌బిల్లుకు ఆమోదం లభించిందన్నారు. ఈ సందర్భంగా రైతులు వెంకటేశ్వరరెడ్డికి స్వీట్ తినిపించి సత్కరించారు. కార్యక్రమంలో వీరారెడ్డి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

◆ **వీరాంజనేయుడికి ప్రత్యేక పూజలు**



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని హమాలీ కాలనీలోని వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, నవగ్రహ, శిఖర పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండప్ప, విజయ్‌కుమార్, నామ రవికిరణ్ గుప్తా, యాకూబ్, మిథున్‌రాజ్, రాకేష్, బండిమోహన్‌లు పాల్గొన్నారు.

◆ **విద్యార్థిని చదువుకు సహకారం**



జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రానికి చెందిన అతినారం దేవిక ఇంటర్మీడియట్ పూర్తి చేసి డైట్‌సెట్ చదువుతోంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విద్యార్థిని మైత్రి ఫౌండేషన్‌ను ఆశ్రయించింది. ఈ మేరకు విద్యార్థిని చదువుకు అన్ని విధాల అండగా నిలుస్తూ ఫౌండేషన్ చైర్మన్ చెన్నంశెట్టి ఉదయ్‌కుమార్ డైట్‌సెట్, ఎన్టీఏ పుస్తకాల మెటీరియల్‌ను విద్యార్థినికి అందజేశారు. కృషి పట్టుదలతో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని భరోసా కల్పించారు. చదువుకు సహకరించిన ఫౌండేషన్ సభ్యులకు విద్యార్థిని కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చెన్నంశెట్టి మౌనిక నవీన్ సాగర్, వెంకటేష్, గ్రామస్తులు శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.